క్లుప్తంగా

రిమ్స్ అన్నపూర్ణకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య దాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో పర్లాకిమిడికి చెందిన త్రిపురాన పద్మజ, మండపల్లి రాజారాణి, బయ్యాపు రాణిదేవిలు తమ తల్లి ఆలమూరు జానకమ్మ జ్ఞాపకార్థ రూ.10 వేలు విరాళంగా అందచేసినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. దాతలకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షుడు గంగుల రమణబాబు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు, పైడి కోటేశ్వరరావు, లక్ష్మణరావు, వెంకటరావు, లోకనాథ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ వితరణ



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సతివాడ గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగ విద్యార్థి దాసరి ఢిల్లేశ్వరరావుకు నగరానికి చెందిన సుసరాపు శ్రీలత, బొట్ట సాయి కుమార్, ఎస్‌బీఐ అసోసియేట్ నల్ల గౌతమి, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ సమూహ దాతలు అందించిన సహకారంతో ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు బుధవారం అందజేశారు. సుమారు రూ.40 వేలు విలువ చేసిన ట్రై సైకిల్‌ను అందించడం హర్షణీయమన్నారు. వాట్సాప్ స్టేటస్ ద్వారా స్పందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నంది ఉమాశంకర్, సుదర్శనరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగలో వేంచేసిన అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవధాన కార్యక్రమం



అవధాన కార్యక్రమం చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ హడ్కో కాలనీ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం ఉదయం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో అవధాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా పాటలు, పద్యాలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు బాల కథా నిలయం, అధ్యక్షుడు బోగెల ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కార్పొరేషన్ వరం, ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఉప్పు త్రినాథరావు, గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను అవధానులుగా అభినయం చేశారు. 25 మంది విద్యార్థులు వారికి తెలిసిన పద్య పఠనం చేశారు. అనంతరం సినీ భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం వారికి బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి నట్టేట ముంచారు



రణస్థలం: తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిప్రతం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ తదితరులు



రణస్థలం: వెన్నుపోటు దినంలో ఎండీయూ ఆపరేటర్ల సంఘీభావం



రణస్థలం: వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ



రణస్థలం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

- ఏడాది పాలన అంతా మోసాల మయం
- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- వెన్నుపోటు దినంకు పోటెత్తిన ప్రజలు

రణస్థలం: ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి, అధికారంలోకి రాగానే కూటమి నాయకులు ప్రజలను నట్టేట ముంచారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినానికి ప్రజలు, పార్టీ శ్రేణులు పోటెత్తారు. జేఆర్‌పురం జామియా మసీద్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఎన్.ప్రసాద్‌కు సూపర్ సిక్స్ హామీలతో పాటు 143 హామీలను నేరవేర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసాలమయమని దుయ్యబట్టారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను వేధిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

ఒక్క పథకాన్నీ అమలు చేయలేదు

సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల సమయంలో హడావుడి చేసిన కూటమి నాయకులు ఏడాది కాలంలో ఒక్క పథకాన్నీ అమలు చేయలేదని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు తుస్సు అయ్యిందని, రైతులకు పెట్టుబడి నిధి లేదని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ఉన్నత చదువులు చదువుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పేద ప్రజల ఇళ్లకే రేషన్ అందిస్తే, అటువంటి రేషన్ వాహనాలను కూడా కూటమి ప్రభుత్వం తొలగించిందన్నారు. స్థానికంగా ఉన్న యూబీ పరిశ్రమలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను తొలగించేశారని విమర్శించారు. మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే స్థానిక పరిశ్రమల్లో ఎచ్చెర్ల నియోజకవర్గ నిరుద్యోగులకే అవకాశం కల్పిస్తామని చెప్పారు. వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి సంఘీభావంగా రేషన్ వాహనాల ఆపరేటర్లు వచ్చి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణ, రొక్కం బాలకృష్ణ, పిన్నింటి సాయికుమార్, మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీలు కాయల రమణ, మీసాల సీతంనాయుడు, నాలుగు మండలాల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, దన్నాన రాజీనాయుడు, బోర సాయిరాంరెడ్డి, డోల వెంకటరమణ, నాయకులు బల్లాడ జనార్దన్ రెడ్డి, పైడి శ్రీనివాసరావు, గొర్లె అప్పలనాయుడు, అప్పలనర్సునాయుడు, పిన్నింటి సత్యంనాయుడు, మీసాల శ్రీనివాసరావు, లంకలపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: వెన్నుపోటు దినంకు తరలివెళ్లిన జి.సిగడాం నాయకులు



జి.సిగడాం: ర్యాలీకి బయల్దేరిన కార్యకర్తలు

మోసకారి బాబు గద్దె దిగాలి



ప్లకార్డులతో ర్యాలీగా వెళ్తున్న పార్టీ కార్యకర్తలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

- నినదించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- విజయవంతంగా వెన్నుపోటు దినం
- శ్రీకాకుళంలో భారీ ర్యాలీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం రూరల్: ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న సీఎం చంద్రబాబు గద్దె దిగాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నినదించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా హామీలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలో వెన్నుపోటు దినం బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వైఎస్సార్ (ఏడురోడ్లు) కూడలి నుంచి డే అండ్ నైట్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వేలాది మందితో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు హామీలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాలతో శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం కదం తొక్కింది. పాలకొండ రోడ్డంతా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కిక్కిరిసిపోయి అటువైపుగా వచ్చే వాహనాలను దారి మళ్లించారు. ప్రధాన కూడళ్లు అన్నీ జై జగన్.. జై ధర్మాన నినాదాలతో హోరెత్తాయి.

ప్రజా వ్యతిరేకత తేటతెల్లం

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనపై ప్రజా వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో వెన్నుపోటు దినంతో తేటతెల్లమైందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం కూటమి వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఏడాది కాలంలో రూ.కోట్లు అప్పు చేయడం తప్ప మరొక్కటి చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకులను అరెస్టులతో వేధించడం తప్ప, చేసిన అభివృద్ధి శూన్యమని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు, కళింగ వైశ్య కుల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎంవీ పద్మావతి, అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురాం, చిట్టి జనార్దనరావు, ముంజేటి కృష్ణమూర్తి, రౌతు శంకరరావు, కొణార్క్ శ్రీను, మండవల్లి రవి, టి.కామేశ్వరి, పీస గోపి, పీస శ్రీహరి, మూకళ్ల సుగుణ, సాధు వైకుంఠరావు, బుక్కూరు ఉమామహేశ్వరరావు, సీపాన వెంకటరావు, పిల్లల రామకృష్ణ, పొన్నాడ రుషి, గొండు కృష్ణమూర్తి, సీపాన రామారావు, తంగుడు నాగేశ్వరరావు, అంధవరపు రమేష్, బైరి మురళి, చీమల తారక్, చల్లా రవికుమార్, ఎచ్చెర్ల శ్రీధర్, రుప్ప దివ్య, మూకళ్ల తాతబాబు, బగ్గు అప్పారావు, పొన్నాన కూర్మారావు, చిట్టి రవికుమార్, గంగు నరేంద్రకుమార్, పెదపాడు దశరథ, గుండ హరీష్, బాణ నర్సింగరావు, గుండ డిల్లీరావు, రుప్ప అప్పలసూరి, కంచు వసంత, యజ్జల గురుమూర్తి, చిట్టి లక్ష్మణరావు, ఇప్పిలి బాబు, బగాది మనోజ్, బొబ్బాది చంద్రమౌళి, మట్ట నగేష్, రావాడ మోహన్, నీలంశెట్టి రామకృష్ణ, బాణ శ్రీను, కొయ్యాన నాగభూషణం, నక్క శంకర్, సూరాడ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది

ఎచ్చెర్ల: మండలంలోని శివాజీ దిబ్బలపాలేం, కె.మత్స్యలేశం, డి.మత్స్యలేశం గ్రామాల్లో కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీసుస్టేషన్ సిబ్బంది బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జి.హరికృష్ణారావు మాట్లాడుతూ మత్స్యకారులు వేటకు వెళ్లిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. తీరం వెంబడి ఉగ్రవాదులు సముద్రం మీదుగా వచ్చే సూచనలు ఉన్నందున, కొత్త వ్యక్తులు కనిపించినా, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా గుర్తించినా వెంటనే తెలియజేయాలన్నారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీసు టోల్ ఫ్రీ నంబర్ 1093 లేదా కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో ఫోన్ నంబర్ 93929 14712కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మత్స్యకారులు, గ్రామ విజిలెన్స్ కమిటీ సభ్యులు, సాగర్ మిత్రలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలి



జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: శ్రీకాకుళం జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలని ఈవీసీ విజయకుమార్, కమిషనర్ ఢిల్లీరావు, స్పెషల్ మండల కమిషనర్ రాజశేఖర్‌లు సూచించారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై జూమ్ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం పూజారి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం బలోపేతం చేయడానికి ఆర్‌ఎస్‌కేలో ఉన్నటువంటి వీఏఏ, వీహెచ్‌ఏ, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బందికి జిల్లా స్థాయిలో మూడు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజన్ స్థాయిలో 12, 13, 14వ తేదీల్లో ఒక శిక్షణ, 19, 20, 21వ తేదీల్లో రెండో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. జిల్లాలో ఆర్‌ఎస్‌కే సిబ్బందికి పూర్తి శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఆఫీసర్ హేమసుందర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: విద్యార్థులకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని అంబేడ్కర్ యూనివర్సిటీ పీడీ మన్నెల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జేఆర్‌పురం హైస్కూల్లో నిర్వహించిన వాలీబాల్ వేసవి శిక్షణా శిబిరం బుధవారంతో ముగిసింది. రాష్ట్రస్థాయిలో నైపుణ్యం పొందిన వాలీబాల్ కోచ్‌లు వెంకటరమణ, గణేష్‌లతో నెల రోజులు పాటు వాలీబాల్‌లో 40 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే విద్యార్థులకు నిత్యం పౌష్టికాహారం కూడా అందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాసితులు పిన్నింటి సత్యంనాయుడు, కొమనాపల్లి హరికృష్ణ, దుక్క రమణమూర్తి, నెమలిపురి బాలరాజు, రాజాపంతులు సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ముర్రాటలు సమర్పణ



నూకాలమ్మ దేవర వద్ద పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సిరిమాను ఉత్సవంలో భాగంగా నూకాలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి అమ్మవార్లకు బుధవారం ముర్రాటలు సమర్పించారు. సంతోషిమాత గుడి వద్దనున్న పెద్దమ్మ తల్లి దేవర వద్ద, నక్కవీధిలోని నూకాలమ్మ దేవర వద్ద భక్తులు వచ్చి ముర్రాటలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అభినయ నృత్య నికేతన్ గురువు టి.నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చిన్నారుల చక్కనైన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్, డాక్టర్ శివప్రసాద్, ఎల్.రామలింగస్వామి, మావూరు శేఖర్, నక్క శంకరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ షో



మ్యాజిక్ షో నిర్వహిస్తున్న దేవేంద్రప్రసాద్

ఎచ్చెర్ల: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో బుధవారం శ్రీకాకుళంకు చెందిన మలిపెద్ది దేవేంద్రప్రసాద్ చేసిన మ్యాజిక్ షో విద్యార్థులకు ఆకట్టుకుంది. అనంతరం మాట్లాడే బొమ్మతో యోగాసనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, యోగా శిక్షకులు కోరాడ వాసుదేవరావు, పప్పు మల్లేశ్వరరావు, దేవేంద్రప్రసాద్‌ను సత్కరించారు.

అందరి సహకారంతోనే గ్రామాల పరిశుభ్రత



చెత్త సంపద కేంద్రం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ

జి.సిగడాం: గ్రామాల్లో యువత, ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యమని డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. మండలంలోని వెలగాడ, పెంట గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో మంజూరు చేసిన చెత్త సంపద కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. వేసవి కారణంగా సీజనల్ వ్యాధులు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ సంబంధిత అధికారులు మురికి కాలువల్లో ఉన్న చెత్త చెదారం తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి బావులు, ట్యాంకుల్లో బ్లీచింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు తులసీప్రసాద్‌సాహు, చేబ్రోలు సురేష్, రౌతు చైతన్య, ధర్మవరపు సతీష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇందు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అరసవల్లి: జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీ సెక్షన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలియజేశారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కుండపోత వర్షం

జి.సిగడాం: మండల కేంద్రంతో పాటు పెంట, నాగులవలస, మర్రివలస, సీతంపేట, గొబ్బూరు, మెట్టవలస, గేదెలపేట గ్రామాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. పాలాల్లో నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల మానసిక పరిణితికి దోహదం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, నిర్వాహకులు

రణస్థలం: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల మానసిక పరిణితికి దోహదం చేస్తాయని జిల్లా ఉద్యానవన అధికారి రత్నాల వరప్రసాద్ అన్నారు. మండలంలోని కోస్టా పంచాయతీలో మహిళా పోలీసు బమ్మిడి అమ్మోజీ నిర్వహించిన ఏఐ బాల వికాస్ వేసవి శిక్షణ శిబిరం ముగింపులో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం, నైపుణ్యాలు పెంపొందించేలా ప్రత్యేక ప్రణాళికతో 33 రోజుల శిక్షణ ఇచ్చిన అమ్మోజీని ప్రశంసించారు. పిల్లల అభివృద్ధికి ఈ శిబిరాలు ఒక వరం లాంటివన్నారు. సీఐ ఎం.అవతారం మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలు, యోగ, ప్రాణాయామం ప్రతిరోజూ సాధన చేస్తూ ఉన్నతమైన లక్ష్యాల దిశగా విద్యార్థులు సాగాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన పదిమంది విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి, గ్రామ పెద్దలు పిసిని జగన్నాథ నాయుడు, అసిరి నాయుడు, అప్పడుదొర తదితరులు పాల్గొన్నారు.